# అలుపెరుగని పోరాట యోధుడు మందకృష్ణ

**ఎమ్మార్పీఎస్ బెజ్జంకి మండల అధ్యక్షులు వడ్లూరి పరుశరాములు.**



జనత న్యూస్ బెజ్జంకి : మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల కోరికను 30 సంవత్సరాల అలుపెరుగని పోరాటంతో రిజర్వేషన్ వర్గీకరణ సాధించిన పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ అని బెజ్జంకి మండల ఎంఆర్పీఎస్ నాయకులు కొనియాడారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి , మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పరుశరాములు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా, రాజ్యాంగ స్ఫూర్తితో పోరాటం చేసి వర్గీకరణ రిజర్వేషన్లు సాధించిన కృష్ణ అన్నకు మాదిగ జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూ మాదిగ జనాభా ప్రకారం 11% రిజర్వేషన్ ఇచ్చే విధంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది పరశు రాములు, తాడిశెట్టి భూమయ్య, మోదుంపల్లి రాజు, బట్టు ప్రసాద్, బోనగిరి ఆనందం, కొమ్ము లచ్చయ్య, బోనగిరి చంద్రయ్య, మహంకాల బాలయ్య, కొంపెల్లి రాజు, పొట్లపల్లి లక్ష్మణ్, లింగాల మల్లయ్య, బాలయ్య, మహంకాళి రాజయ్య, వడ్లూరి ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మహంకాళ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బండికి ధన్యవాదాలు

**మండల బిజెపి నాయకులు బోనగం నరేష్ గౌడ్**



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో నాలుగో వార్డ్ కు ఐమాక్స్ లైట్లు ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మండల బిజెపి సీనియర్ నాయకులు బొనగం రమేష్ గౌడ్ శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ వివక్ష లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సంఘ రవి, నాయకులు గంగుల ఎల్లం, దొమ్మాటి రాములు, బండిపెల్లి చంద్రయ్య, మండల కార్యదర్శి వడ్లూరు శ్రీనివాస్, సోషల్ మీడియా ఇంచార్జ్ దొడ్ల ప్రశాంత్, వడ్లూరు సాయిలు, ఐలేని భాస్కర్ రెడ్డి, బండిపెల్లి సునీత శ్రీనివాస్ గౌడ్, బుర్ర కిషన్ గౌడ్, శీలం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



జనత న్యూస్ బెజ్జంకి : బెజంకి మండలం చిలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 2008- 9 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు పైడి నాగరాజు, ఎండి అజారుద్దీన్ పంతం మనోజ్, బండిపెల్లి ప్రవీణ్, శ్రీరాముల లు శుక్రవారం వాటర్ ఫిల్టర్ మిషన్ ను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామంచ రవీందర్, చంద్రమౌళి, కవిత, రాధిక, గ్రామస్తులు శానగొండ శరత్ కుమార్, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మత్స్యగిరీంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం

**ఈ నెల 12న మహా పౌర్ణమి జాతర**

**కళ్యాణోత్సవంలో పాల్గొననున్న మంత్రులు**

**రూ 20 లక్షలతో జాతర ఏర్పాట్లు**

**ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు**

**సమర్పించనున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి**







జనతా న్యూస్, ప్రతినిధి కోరం సుధాకర్ రెడ్డి : కోరిన కోరికలు తీర్చే శ్రీ మత్స్య గిరింద్ర స్వామి బ్రహ్మోత్సవాలు నేడు కళ్యాణ మహోత్సవంతో ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను ఆలయ చైర్మన్ ఉప్పుగల మల్లారెడ్డి, ప్రధాన ఆచార్యులు మురళీధర్ అయ్యగారు సమక్షంలో ప్రభుత్వ అనుసంధాన అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్తగట్టు బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 8న మత్స్య గిరీంద్రుని కల్యాణోత్సవం జరగనుంది. వరంగల్ కరీంనగర్ నగరాల మధ్య హుజురాబాద్ కు ఏడు కిలోమీటర్ల దూరంలోని శంకర పట్నం మండలం కొత్త గట్టు వద్ద గుట్టపై 11 శతాబ్దంలోనే విష్ణుమూర్తి మత్స్యావతారంలో వెలసినట్లు చరిత్ర చెబుతోంది. దశావతారాలలో ఒకటైన మత్స్యావతారం ఇక్కడే వెలసినట్లు భక్తుల విశ్వాసం, ఈ దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించబడినట్లు చెప్తారు. స్వామివారు భూదేవి, శ్రీదేవి సమేతంగా ఇక్కడ వెలసినట్లు చెప్తారు. గుట్టపై ప్రశాంత మైన వాతావరణంలో మాఘమాసంలో 12 రోజులపాటు ఇక్కడ స్వామివారి జాతర జరుగుతుంది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. ఇక్కడి కోనేరులో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటే, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం, జాతర సమయంలో వేలాది మంది భక్తులతో ఆలయం సందడిగా కనిపిస్తుంది. ఇక్కడ అంజనేయ స్వామి ఆలయం, శివాలయం కూడా ఉన్నాయి. కేవలం ఈ ప్రాంతం నుండే కాకుండా సుదూర ప్రాంతాల నుండి భక్తులు జాతర సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తారు. ఈ ప్రాంతానికి చెందిన చాలా మంది మత్స్య గిరింద్రుని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. చాలామంది విశ్వాసం మేరకు ఈ ప్రాంతాల్లో మచ్చయ్య, మచ్చగిరి పేర్లు కనిపిస్తాయి. విష్ణుమూర్తి కొలువైన అరుదైన ఆలయంగా కొత్తగట్టు ప్రకృతి రమణీయత మధ్య విరాజిల్లుతోంది. అంచెలం చెలుగా కొత్త గట్టు ఆలయ అభివృద్ధి పురాతన కాలంలో వెలసిన ఆలయం వద్దకు వెళ్లేందుకు మార్గం ఉండేది కాదు. కాలానుగుణంగా ఒక మెట్ల దారిని గ్రామస్తులు, భక్తులు వంద సంవత్సరాల క్రితమే చెక్కించారు. ఆలయం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గత మాసంలో కళ్యాణ మండపం, రెండు గదులను ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రారంభించారు ,అయితే ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ . 20 లక్షలు జాతర కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే కోటా నిధులు మంజూరు చేశారు. కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను స్వయంగా ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ నమర్పించనున్నారు. జాతరకు జిల్లా మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొన్న ప్రభాకర్ లతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు, ఆలయ అభివృద్ధికి ఆలయ ప్రహరీ ని నిర్మించేందుకు వర్ధినేని రవీందర్ సామజిక కార్యకర్త తనవంతు సహాయ సహకారాలు అందించారు .

# హుజురాబాద్లో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ




హుజురాబాద్, ఫిబ్రవరి 7 జనత న్యూస్: భారత ప్రభుత్వం చేపట్టిన టీబి ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టీబి ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలకు టీబి ఫ్రీ గ్రామపంచాయతీ అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లాలు ప్రెస్సి అధికారి రవీందర్ రెడ్డి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చందు, డాక్టర్,మధుకర్ ఎంపీడీఓ సునీత హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పంజాల ప్రతాప్. ఎస్ టి ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ,డిస్ట్రిక్ట్ లీడ్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అందరూ ఈ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని హుజురాబాద్, సైదాపూర్ లోని అన్ని గ్రామాలను టీబి ఫ్రీ గ్రామాలుగా మార్చడానికి అందరి సహాయ సహకారాలు అవసరం అని అన్నారు. ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాను టీబి రహిత జిల్లాగా చేయడానికి జిల్లా క్షయ నివారణ విభాగం, జనరల్ హెల్త్ స్టాఫ్ తో కలిసి కొత్త కేసులను గుర్తించేందుకు, ఉన్న కేసులను సక్రమంగా మందులు వాడి ట్రీట్మెంట్ సక్సెస్ రేట్ పెంచేందుకు పి ఆర్ ఐ ఇన్స్టిట్యూషన్స్ తో కలిసి గ్రామాలలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రతి మండలంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి వారి సహకారంతో టీబి ఫ్రీ పంచాయతీలుగా చేయడానికి కృషి చేస్తామని ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధి ప్రభాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఈ పి సిబ్బంది, సుశాంత్, పంచాయతీ కార్యదర్శులు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గీతాంజలి పాల్గొన్నారు.

# నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 7 :** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు భాజపా ఎరవేస్తోందని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన ఏసీబీ బృందం ఆప్ అధినేతకు లీగల్ నోటీసు పంపించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని అందులో పేర్కొంది. ఎన్నికల ఫలితాలకు ముందు రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఈ నెల 5న ఢిల్లీ ఎన్నికలు జరగగా 8న శనివారం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇందుకు ఇసి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 70 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బిజెపి, ఆప్ మధ్య పోటాపోటీ జరిగింది. ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని వెల్లడించాయి ఈ క్రమంలో పార్టీ మారేందుకు 16 మంది ఆప్ అభ్యర్థులకు భాజపా లంచాలు ఇవ్వజూపిందంటూ కేజ్రీవాల్ ఎక్స్‌లో చేసిన పోస్టును ప్రస్తావిస్తూ.. ఆ ట్వీట్ చేసింది మీరేనా? అని నిర్ధరించాలని ఏసీబీ పేర్కొంది. ఆ ఆరోపణలకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ఫోన్ కాల్ అందుకున్న ఆ 16మంది అభ్యర్థులు ఎవరు? వారికి వచ్చిన నంబర్లు, సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపింది.

# అమెరికాలోనూ ఉద్యోగుల కోత

**ట్రంప్ చర్యలతో స్వదేశంలోనూ వ్యతిరేకత**



వాషింగ్టన్,ఫిబ్రవరి 7 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు, ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ'లో ఏకంగా 9,700లకు పైగా ఉద్యోగాలు తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 10వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా బ్యూరో, ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట..! మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే, దీనిపై అమెరికా విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని, వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అటు డోజ్ విభాగ సారథి, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ.. యూఎస్ఎయిడ్ నేరగాళ్ల సంస్థ అని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఇటీవల ఈ సంస్థలో వందలాది మంది ఉద్యోగులను సెలవుపై పంపించారు. దాదాపు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడానికీ, ఆ దేశాల అభివృద్ధికీ, భద్రతకూ నిధులు సమకూర్చడానికీ యూఎస్ఎయిడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ వందల కోట్ల డాలర్లను సహాయంగా అందిస్తోంది. సీసీపైనా ఆంక్షలు.. మరోవైపు, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాజాగా ఆయన సంతకం చేశారు. అమెరికా, దాని మిత్రదేశం ఇజ్రాయెల్ లక్ష్యంగా నిరాధార దర్యాప్తులు చేపడుతోందని ఈ సందర్భంగా అధ్యక్షుడు దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూపై అరెస్టు వారెంట్ జారీ చేసి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తన అధికారాలను దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు.

